# ఋణాధృవం

- యస్.కె. రామారావు

అనగనగనగా ఈ మహాభూమండలం మీద ఒక మహాసామ్రాజ్యం వుండేది. ఆ సామ్రాజ్యాన్ని చంద్రసేనుడు అనే చక్రవర్తి పరిపాలిస్తుండేవాడు. ఆయన రాజ్యంలో అక్షరాన్యుల జనాభా గణనీయంగానే ఉండేది. అయితే అక్షరాస్యత - జ్ఞానం అనే రెండు విషయాలు సాధారణంగా పరస్పర విరుద్ధాలు కాబట్టి జ్ఞానుల సంఖ్య అంతంత మాత్రంగా వుండేది. వార్తాపత్రికలు తాళపత్రాల మీద ప్రతి వారానికి గ్రామానికొక్కటి చొప్పున చేరుతుండేవి.

చంద్రసేనుడి రాజ్యంలో వర్ణవ్యవస్థ పటిష్ఠంగా పాతుకుపోయింది. ఉన్న వాడు లేనివాడిని దోచుకోవటం పరిపాటి అయిపోయింది. కొంతమంది యువకులకు ఈ విధానం సహజంగానే నచ్చలేదు. వాళ్లంతా ఒక పక్షాన చేరి, చంద్రసేనుణ్ణి కత్తుల ద్వారా పదవీ భ్రష్టుడిని చేసి, కత్తి ద్వారా రాజ్యాధికారం సంపాదించాలనే ఉద్దేశ్యంతో కత్తుల యుక్తంగా అడవుల్లోకి వెళ్ళిపోయారు.

ఈ నేపథ్యంలో అల్లర్లు చాప కింద నీరులా రాజ్యంలోకి ప్రవేశించాయి. దొంగతనాలు, దోపిడీలు, మానభంగాలు, హత్యలు మొదలైన అన్ని నేరాలూ రాజ్యంలో విలయతాండవం చేయసాగాయి.


ఈ పరిస్థితి చంద్రసేనుడికి ఆందోళన కలిగించింది. తక్షణం ఆయన తన వృద్ధమంత్రినీ, మరికొంతమంది సలహాదారులను సమావేశపర్చి సమస్యలను తక్షణం రూపుమాపాల్సిన చర్యల్ని చేపట్టవలసిందిగా కాళ్ళా, వేళ్ళా పడ్డాడు. వాళ్లంతా కలిసి ఒక నివేదికను రాజు గారికి సమర్పించారు. వాళ్ళు సూచించిన సంస్కరణలు ముఖ్యంగా ఈ రకంగా వున్నాయి.

జనస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, ప్రజలెన్నుకున్న ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను రాజుగారి దృష్టికి తేవాలి. ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో చంద్రసేనుడు జ్ఞానులుగా భావించిన వాళ్లకు కొన్ని శాఖలు ఏర్పాటు చేసి, వాటికి వాళ్ళను మంత్రులుగా నియమించాలి. ప్రతి పది గ్రామాలకు రక్షకభట నిలయాలు ఏర్పాటు చేసి ప్రజల జీవితాలను వాళ్ల చేతుల్లో పెట్టాలి. ఈ రక్షక భట వ్యవస్థలో అంచెలంచెలుగా అధికారులూ, పై అధికారులూ వగైరా వుంటారు. ఒక న్యాయ వ్యవస్థను సృష్టించి న్యాయాధికారులను నియమించాలి.

ఈ న్యాయవ్యవస్థలో కూడా క్రింది స్థాయి న్యాయాధికారులు వాళ్ళపై న్యాయాధికారులను నియమించాలి. ప్రజలందరికీ విద్య - వైద్యం. అది సక్రమంగా అమలు చేయగలిగితే చంద్రసేనుడి రాజ్యానికి తక్షణం ఏర్పడగల ముప్పు ఏమీ లేదు. ఇలా ఆ నిపుణులు నిర్ధారించి మరీ చెప్పారు.

ఈ సూచనలు చంద్రసేనుడికి ఒక రకంగా నచ్చాయి. కానీ, అవి అమల్లో పెడితే తన కిరీటానికి భద్రతా వుందా? అయితే సంస్కరణలు సూచించిన నివేదిక అడుగున ఒక అంశం వుంది. అన్ని శాఖల మీదా తనది సార్వభౌమత్వం, మంత్రులు ఏ పనులు చేసినా వాటికి తన ఆమోదముద్ర లేకుంటే అవి చెల్లవు. చాలా ముందు చూపుతో చంద్రసేనుడు తన రాజముద్రికను తన భార్య కూడా చూడకుండా ఒక రహస్య నేలమాళిగలో దాచిపెట్టాడు.

జనస్వామ్యపు ఎన్నికలు వచ్చేశాయి. ప్రజాప్రతినిధులూ, మంత్రులూ వెలిశారు. రక్షకభట శాఖ తన పని మొదలెట్టింది. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తితో మొదలయింది. అసలు చిక్కు ఇక్కడే వచ్చింది. యుద్ధప్రాతిపదికన చట్టాలు తయారు చేయవలసి వచ్చింది. శిక్షాస్మృతి, వివాహ చట్టం, ఆస్తి హక్కుల చట్టం, సాక్ష్యాధార చట్టం ఇలా ఎన్నో చట్టాలు తయారయ్యాయి. న్యాయస్థానాలు వెలిశాయి. కానీ న్యాయశాస్త్ర కోవిదులు లేరు. ప్రభుత్వం తక్షణమే కొన్ని విశ్వవిద్యాలయాలు - వాటికి అనుబంధంగా న్యాయకళాశాలలు ప్రారంభించింది. న్యాయ కళాశాలల్లో విద్యార్థులకు, భాషా, తర్క మీమాంస, వ్యాకరణాది విషయాల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణా కాలం నాలుగు మాసాలు. నాలుగు మాసాల తర్వాత వీరికి పట్టాలు ప్రసాదిస్తారు. వీళ్ళలో ప్రతిభాశాలురుగా భావించిన వాళ్ళకు న్యాయాధికారులు, న్యాయాధిపతులు, న్యాయమూర్తులుగా ఉద్యోగాలు ప్రసాదిస్తారు. మిగిలిన వారు న్యాయవాదులుగా కొనసాగుతారు. కక్షిదారులు ఈ న్యాయవాదులను




నియమించుకుని తమ వ్యాజ్యాలు న్యాయస్థానాల్లో నడివించుకోవచ్చు "జయాపజయములు దైవాధీనములు." అనే ఆర్యోక్తి గోడకు వేలాడదీసి వుంచాలి.

న్యాయస్థానాల్లో ఏ భాష వాడాలి అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన నిపుణులు న్యాయాధికారులు - న్యాయవాదులు విధిగా వ్యాకరణ యుక్తమైన పరమ గ్రాంధిక భాష మాట్లాడాలి. తీర్పులు ఆ భాషలోనే రాయాలి. అని నిర్ధారించి దానికి కూడా ఒక చట్టం తెచ్చారు. అయితే ఏమాటకామాటే చెప్పుకోవాలి. నాలుగు నెలల్లో భాషా తర్క మీమాంస వ్యాకరణ ధర్మశాస్త్రాలు ఆపోసన పట్టిన వారికి కొంచెం పచ్చివెలక్కాయ గొంతులో ఇరుక్కున్నట్లుగా తోచింది. వారి శిక్షణా కాలంలో వారు వ్యాకరణానికి ఎప్పుడూ ప్రాముఖ్యం ఇవ్వలేదు. ఊరికి కరణం భాషకు వ్యాకరణం శత్రువులు అనే ద్రవిడోక్తిని నమ్మినవాళ్ళు వారు.

ఒకనాడు చంద్రసేనుడు రవాణా శాఖా మంత్రినీ, వైద్యశాఖా మంత్రినీ వెంట పెట్టుకొని రథంలో ఆయా శాఖల పనితీరును పర్యవేక్షించటానికి దేశం మీద పడ్డాడు. రవాణా వ్యవస్థ ఒక ప్రభుత్వ సంస్థ చేతుల్లో వుంది. దేశంలో రహదారులకు కొరత లేదు. ప్రభుత్వ సంస్థ వాహనాలుగా, రథాలకూ, ఎడ్లబండ్లకు కొదవేలేదు! కానీ, ఎక్కడ చూసినా రథ ప్రమాదాలే. కొంతమంది ధనికులకు స్వంత రథాలూ, గుర్రాలు వున్నాయి. ప్రమాదం జరిగిన చోట తెల్ల అంగరఖాలు

ధరించి, మెళ్ళో నల్లకండువా చుట్టుకున్న పెద్ద మనుషులు కనిపించారు. వీరంతా ఎవరు? అన్నట్లుగా చంద్రసేనుడు భ్రుకుటి ముడివేశాడు.

వాళ్ళంతా న్యాయవాదులు ప్రభూ! రథ ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని చట్టం వుంది ప్రభూ. అది న్యాయస్థానం ద్వారా జరగాలి అందుకే పాపం వీళ్ళు ప్రమాదం జరిగిన వెంటనే ఇక్కడకొచ్చేశారు అన్నాడు రవాణా మంత్రి.

చంద్రసేనుడి కళ్ళల్లోనుంచి ఆనందంతో కూడిన కన్నీళ్ళు జలపాతంలా దూకటం మొదలెట్టాయి.

ఆహా! ఏమి వీరికి తోటి మానవుల పట్ల ప్రేమ, అనురాగం, జనస్వామ్య ప్రభుత్వం జయహో! అన్నాడు. రవాణా శాఖ మంత్రి గోళ్ళు కొరుకుతూ

"అయ్యా! ఆ పరిహారంలో ఈ న్యాయవాదులకు వాటా వుంటుంది. పొద్దుట లేచిన పక్షికి పురుగులెక్కువ దొరుకుతాయి కదా! ఆ సూత్రాన్నను సరించి వీళ్ళు అలా ఒకసారి రహదారి చూచుకొని వెళ్తారు" అన్నాడు.

హతవిధీ అని చంద్రసేనుడు రథాన్ని ఒక వైద్యశాలకు తీసుకెళ్ళమన్నాడు.

రథాన్ని ఒక చెట్టు కింద నిలపగానే చంద్రసేనుడు వైద్యశాఖా మంత్రి క్రిందికి దిగి ఒక మూలగా నిల్చున్నారు. ఇంతలో ఒక బృందం వైద్యోనారాయణో హరి, వైద్యోనారాయణో హరీ అని సామూహిక భజన నిర్వహిస్తూ వస్తూ కనిపించింది.

''అమాత్యా! ఈ భక్తులు వైద్యశాలను దేవాలయంలా భావించినట్లున్నారు. ఒక వేళ వారు రుణగ్రస్తులయిననూ వారి భక్తికి మనం సంతసించాలి" అంటూ బృందంలో ఒక వ్యక్తిని ఇలా అడిగారు.

"నాయనా! మీకు హరినామస్మరణ చాలా ఇష్టం లాగుంది. సంతసం నాయనా! సంతసము"

"భక్తి కాదు మారాజా! ఇది వైద్యశాసనం. ప్రధాన వైద్యుల వారు, ప్రతీ రోగినీ ఇలా భజన చేసుకుంటూ రమ్మంటారు. రోగం తగ్గితే ఇంటికి వెళ్ళి మళ్ళీ భజన చేసుకోవచ్చుట! ఖర్మగాలి కన్నుమూశారా హరి నామస్మరణ వల్ల ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయట!" అదీ సంగతి.

ఒకనాడు చంద్రసేనుడికి తన రాజ్యంలో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు సందర్శించాలని కోరిక కలిగింది. విద్యాశాఖామంత్రిని తోడ్కొని ప్రయాణం కట్టాడు. ఆయన రథం సాగుతున్నంత మేరా రహదారి కిరుపక్కలా అనేక నామధేయాలతో విద్యాలయాలు కనిపించసాగాయి.

" ఇదేమిటి అమాత్యా! ఇన్ని విద్యాలయాలా మన రాజ్యంలో" ఒకింత విస్మయం ఒలకపోశాడు. విద్యాశాఖామాత్యులు వినయంగా ఇలా సమాధానమిచ్చారు.

''అవును మహాప్రభో! మన ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకున్న వాళ్ళకు ఉద్యోగాలు దొరకకపోతే వాళ్ళు స్వంతంగా వారికి తోచిన పాఠశాల పెట్టుకోవచ్చు. వాటిల్లో చదివిన వాళ్ళు మళ్ళా అలా చేయవచ్చు. ఇలా మనం విద్యను సరళతరం చేశాం. మీరు ఆమోదముద్ర వేశారు" అని గుర్తు చేశాడు.

చంద్రసేనుడికి ఒకింత ఆనందం కలిగింది. తన రాజ్యంలో విద్యాలయాలు తామరతంపరగా పెరిగిపోవటం పట్ల హర్షం ప్రకటించాడు.

చంద్రసేనుడి జనస్వామ్య ప్రభుత్వం ఒక కొత్త చట్టం తెచ్చింది. దాని ప్రకారం ప్రతి వ్యాపారస్థుడు తను వ్యాపారం చేసుకోవటానికి ప్రభుత్వ అనుమతి విధిగా తీసుకోవాలి. అనుమతివ్వాల్సిన అధికారులు లంచాలకు చేతులు చాపటంతో వ్యాపారస్థులు ధరలు పెంచేసి ప్రజాశాంతికి కొంచెం కొంచెంగా భంగం కలిగించటం మొదలుపెట్టారు. ఈ విషయం జనస్వామ్య ప్రభుత్వానికి తెలిసి కళ్ళు మూసుకుంది. ఎన్నికలు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరగాలి. వాటికి ప్రచారానికి వ్యాపారస్థులు చాలా ఉదారంగా విరాళాలిస్తున్నారు. వాళ్ళు ఉత్సాహంతో విరాళాలిస్తుంటే వాళ్ళ ఉత్సాహం మీద నీళ్ళు చల్లటం ప్రజాప్రతినిధులకు సబబుగా తోచలేదు.

ప్రజల జీవితం కొంచెం కొంచెంగా అస్తవ్యస్తం కావటం మొదలైంది. పులి మీద పుట్రలా వరుసగా నాలుగు సంవత్సరాలు వర్షాలు పడక రాజ్యంలో పంటలన్న మాట లేకుండా పోయాయి. ఆముదం పంట ఎప్పుడైతే దెబ్బ తిందో అప్పుడే రవాణా రంగం తీవ్రమయిన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. రథం సాగాలంటే ఇరుసున కందెన పెట్టాలి. కందెనకు నూనె లేదు. అలాంటి సమయంలో చంద్రసేనుడు నూనె పుష్కలంగా దొరికే కొన్ని రాజ్యాలతో ఒప్పందం చేసుకుని నూనె దిగుమతి చేసుకోవటం ఆరంభించాడు. నూనె ధర పెరిగి కూర్చుంది. దాంతో రవాణా రుసుము పెంచాల్సి వచ్చింది. తత్కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు నిష్పత్తికి విరుద్ధంగా పెరిగాయి. ఇలా రవాణా రంగం, వ్యాపార రంగం అస్తవ్యస్తం కావటం మొదలెట్టాయి. చంద్రసేనుడికి

అంతుపట్టని విషయం ఒకటి తయారయ్యింది. ఆ విషయం ఆయనను చాలా విస్మయపరుస్తున్నది. ఉన్న వాడు మరీ వున్న వాడుగా మారిపోతున్నాడు. లేనివాడు మరీ లేనివాడుగా మారిపోతున్నాడు. ఈ మాటే మంత్రిమండలిని అడిగాడు. వాళ్ళు ఒక సలహా ఇచ్చారు. భూమధ్యరేఖలా దారిద్ర్యరేఖను ఒకటి ఏర్పాటు చేసి దరిద్రులందరినీ చెడుగుడు ఆటలో గీత ఇవతలికి లాగినట్లుగా చేయి పట్టి లాగటం. ఈ దిశలో ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కానీ ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. సమాజంలో నేరాలు పెరిగాయి. దోపిడీలు, దొంగతనాలు, మానభంగాలు రాజ్యంలో ఎక్కడో ఒక చోట నిత్యకృత్యమై పోయాయి.

అన్ని రంగాలు అస్తవ్యస్తం కావటంతో చంద్రసేనుడికి తన మంత్రుల మీద అనుమానం హెచ్చటం ప్రారంభమయ్యింది. మంత్రులలో కూడా గుసగుసలు ప్రారంభమయ్యాయి. రాజ్యాంగబద్ధంగా చట్టం తయారు చేసి ముసలాడిని పీకిపారెయ్యాలని కొంతమంది యువమంత్రులు ఉబలాటపడ్డారు. ఉత్సాహం ఎక్కువైన ఒక యువమంత్రి మహారాజును దారిద్ర్యరేఖకు దిగువకు నెట్టేసి గిలగిలా కొట్టుకుంటుంటే చూడాలని వుందని తన కోరికను తోటి వారి ముందుంచాడు. అప్పుడు 'దీర్ఘదృష్టి' అనే మంత్రి అందరినీ చీవాట్లు పెట్టాడు. ప్రజల్లో తమ మీద అభిమానం నశించి రాజు గారి మీద సానుభూతి ప్రవహించే పక్షంలో తామంతా కూడా దారిద్ర్యరేఖ దిగువకు వెళ్ళాల్సి వుంటుందని హెచ్చరించాడు.

ప్రజల్లో కొంతమంది తాళపత్రికలకు సంపాదక లేఖలు రాయటం మొదలుపెట్టారు.

" ఆర్యా! మీ / మా తాళపత్రిక బహు ప్రజాసేవ చేస్తుందనటంలో నాకు / మాకు ఎట్టి అభ్యంతరమూ లేదు. రాజ్యంలో అన్ని రంగాలు భ్రష్టుపట్టిపోయాయి. ఈ రాజ్యాన్ని సజావుగా నడిపించాలంటే మన జనస్వామ్యపు సర్వస్వతంత్ర న్యాయవ్యవస్థ ఒక్క దానికి మాత్రమే సాధ్యమని మా విశ్వసనీయ విశ్వాసం" ఇలా లేఖలు తాళపత్రికలలో విరివిగా కనిపించసాగాయి.

ఈ లేఖలు చదివిన చంద్రసేనుడు తన రాజ్యంలో న్యాయవ్యవస్థ తీరుతెన్నులు చూడాలని వువ్విళ్ళూరి, న్యాయశాఖామంత్రితో కుంటివాళ్ళ వేషంలో, చంకల క్రింద కర్రలతో ఒక న్యాయస్థానానికి వెళ్ళి కూర్చున్నాడు.

ఆరోజు ఆ న్యాయస్థానంలో ఒక విడాకుల వ్యాజ్యం విచారణకు వచ్చింది. భర్త పేరు ఏకపత్నీమూర్తి, భార్య పేరు బహుపతిమతి.

## కవితలు...

"కొన్ని దశాబ్దాల నైరాశ్యం నిండిన
గుండె నుండి వెలువడే
ఓ క్షణిక శబ్ద వీచిక - ఫ్లాష్".

**- చెన్నా రామమూర్తి**

## గడ్డిపరక

ప్రతి మనిషీ
ఓ గడ్డిపరక
మగాడైతే భార్య దృష్టిలో
ఆడదైతే భర్త దృష్టిలో

**- వి. శ్రీలక్ష్మి**

బహుపతిమతి బాహాటంగా వ్యభిచరిస్తోందని, తాను కళ్ళారా చూశానని, భార్య దుశ్శీలవతి అయితే చట్టంలోని ఫలానా అధికరణ క్రింద విడాకులు ఇవ్వాలని భర్త వాదన.

భర్త తరపు న్యాయవాది చట్టంలోని ఫలానా అధికరణాన్ని గుర్తు చేస్తూ విడాకులు దయచేయించమని తన వాదన వినిపించాడు. చట్టం చట్టుబండలు గాను. ఇది కదా తాను తన తెలివితేటలు ప్రదర్శించవలసిన అవకాశం అని తలపోస్తూ ప్రామాణిక భాషలో ఇలా అడిగారు.

"న్యాయవాదీ! ఈ భర్త యనుబడు పురుష పుంగవుని వయస్సు ఏ మాత్రం నుండనోపు?"

"ఘనత వహించిన అధికారీ! ఈతని వయస్సు ద్వయవింశతియని వ్యాజ్యమునందలి ప్రథమపుటలో పేర్కొంటిని".

"అటులనా! ఈతని పుంస్త్వమును గూర్చి మీరెరుగుదురా? అనగా ఈతడు కామోద్దీపన శక్తి కోల్పోయినుండవచ్చునా?"

"అది నేనెటుల నెరుగుదును స్వామీ! అట్టి విషయం ఈతని విషయవాంఛా, ఈతని సతికి మాత్రమే తెలిసి నుండనోపు".

"ఆహా! చిక్కితిరి, సున్నితమునూ, బహుకీలకమైన అంశమొక్కటి నా మస్తిష్క వల్మీకంలో తెల్లనాగువలె అంధకార బంధురమయి మేఘావృతమయిన ఆకసమునందు తటిల్లున మెరిసిన విద్యుల్లత వలె మెరిసినది. నా తీర్పు తక్షణమే వెలువరించెదను".

ప్రతిపక్ష న్యాయవాది చటాలున నిలబడి

"ప్రభూ! సాక్ష్యములు స్వీకరించరా? మా వాదన నాలకింపరా? వాదనల నాలకింపక తీర్పునిచ్చు అధికారము మన చట్టముల వ్యవహార నియమావళిలో పొందుపరచబడలేదు".

న్యాయాధికారికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

"ప్రతివాద న్యాయవాదీ! నేను కర్తరీ ప్రయోగం వినా మరియొక ప్రయోగం ఇచ్చగించనని మీరెరుగరా? కర్మణీ ప్రయోగం, బడుధాతువులు అన్యదేశ్యములు అట్టివి నేను సహింపను".

ఈ భాషా యుద్ధం ఎదురెదురుగా నిలబడ్డ భార్యాభర్తలిద్దరికీ అర్థం కాలేదు. చేష్టలు దక్కి నిలబడ్డారు. ఇంగువ ఇన్నమాచార్యులు ఘంటంతో తీర్పును తాళపత్రిక మీద వుల్లేఖించ నారంభించాడు. కేవలం అయిదు నిమిషాల తర్వాత తీర్పు ఈ క్రింది విధంగా వినిపించాడు.

"పురుషులకు సహజముగా తమ యాబదవ ఏట కామ క్రీడలందు ఉత్సాహము నశించును. అట్టి దురదృష్టము ఈ వాదిని వెంటాడినది. ఈతని ధర్మపత్ని వయసు సరిగా నలుబది. అనగా ప్రౌఢత్వం సంతరించుకున్న ప్రాయం. ఇట్టి సమయములో స్త్రీలకు సహజముగా కామము హెచ్చుగా నుండును. అట్టి ధర్మబద్ధమయిన, శారీరక సహజమయిన, ప్రాకృతిక న్యాయమైన ఈవిడ కోరికను, అగ్గిసెగలను వాది తీర్చజాలడు. అగ్నికీలను ఆర్పివేయజాలడు. అట్టి తరి ఈయువ తన కోర్కెలు ఇతరుల ద్వారా తీర్చుకొనుట సహజ న్యాయము కానోపు గానీ వ్యభిచారము మాత్రము కాజాలదు. కావున ఈతనికి విడాకులు నిరాకరించనైనవి. శ్రీమతి బహుపతిమతి తన ఇష్టానుసారము తనకు నచ్చిన వ్యక్తుల నెంచుకొనే స్వేచ్ఛ - వారు న్యాయాధికారులైనా సరే - తీర్పు మూలముగా నందుకొన్నది.

న్యాయవాదులు భార్యాభర్తలకు అర్థమయ్యే భాషలో తీర్పు సారాంశమును వినిపించారు. శ్రీమతి బహుపతిమతి కృతజ్ఞతాపూర్వకంగా న్యాయాధికారి కేసి చూసింది. ఆయన ఆశగా ఆమెవైపు క్రీగంట చూసి కళ్ళతోనే తన కోర్కెను ఆమెకు ప్రసారం చేశాడు. భర్త మటుకు ఆగ్రహం పట్టలేక " ఓరే నువ్వు మీ నాన్నకు పుట్టావని రుజువేందిరా? రేపు నీ పెళ్ళానికి నలభయ్యి, నీకు యాభయ్యి రావా? అప్పుడు నీ పెళ్ళాన్ని ఎవరి దగ్గరకు పంపుతావురా?" అని పెడ బొబ్బలు పెట్టాడు. తర్వాత న్యాయవాదికేసి తిరిగి ఆ భర్త అన్న మాటలు తనకర్థం కాలేదని, ప్రామాణిక భాషలో చెప్పమని అడిగాడు.

అప్పుడు న్యాయవాది

"సుప్రసన్నమణీ, అపర ధర్మరాజా! తమ తీర్పు పాషాణం కరిగించి తన వీనుల యందు పోసినట్లున్నదని ఆ భర్త వాపోవుచున్నాడు ప్రభూ".

"అటు పిమ్మట?"

"అటు పిమ్మట అతను తమ మాతృమూర్తి పాతివ్రత్యాన్ని శంకించినాడు మహాప్రభూ!"

"అటు పిమ్మట?"

"అటు పిమ్మట, తాము తమ పితృదేవతలకే జన్మించినారా? లేక ఇట్టి ప్రాణప్రతిష్ఠా యజ్ఞములో వేరొకరి పాత్ర యున్నదా? అనే సందేహం వ్యక్తపరిచినాడు సమవర్తీ!"

" ఆ ! అది మాకు విన్నవింపుడు"

"తమరికి యాబది వత్సరముల ప్రాయము రాదా? అని విస్మయమందినాడు. తమ సతీమణికి నలుబది సంవత్సరములు వచ్చినచో ఆమె పొందునందుకొనే భాగ్యశాలి ఎవరో అని ఉత్సుకత ప్రదర్శిస్తున్నాడు మహాప్రభో!"

అందుకాయన ఇసుమంతైనా చలించలేదు. న్యాయస్థాన ధిక్కారం క్రింద శిక్ష వేస్తాడోమోనని సందేహిస్తున్న వాళ్ళకేసి చూసి.

"వాస్తవమెపుడూ కఠిన సదృశము, దానిని సామాన్యులు జీర్ణించుకొన జాలరు. మా తీర్పు ఇతనిపై అశనిపాతంలా పరిణమించి నుండనోపు. ఈతనికి క్షమాభిక్ష నొసంగి ఇచ్చోటు వదిలి వెళ్ళవలసినదిగా ఆజ్ఞాపిస్తున్నాను."

న్యాయాధికారి ఔదార్యాన్ని న్యాయస్థానంలో ప్రత్యక్షంగా చూసినవాళ్ళు ఆనందాతిరేకంతో హర్షధ్వానాలు చేశారు.

చంద్రసేనుడు న్యాయశాఖామంత్రి వంక చూస్తూ.

" ఇలాంటి వాళ్ళకా మనం న్యాయాధికారి పదవులిచ్చింది."

వళ్ళు పటపట కొరుకుతూ, మళ్ళీ సంబాళించుకొని గుర్రుగా చూస్తూ అన్నాడు.

"అమాత్యా! ఇక లాభం లేదు, రాజ్యంలో అన్ని రంగాలూ అస్తవ్యస్తమైపోయాయి. రేపు అత్యవసరంగా మంత్రి మండలి సమావేశం ఏర్పాటు చెయ్యండి. నేను రాజ్యంలోని పరిస్థితులను సమీక్షిస్తాను" అన్నాడు.

మర్నాడు మంత్రిమండలి సమావేశం అయ్యింది.

అధ్యక్ష స్థానంలో కూర్చున్న చంద్రసేనుడు

రాజ్యంలో నెలకొన్న పరిస్థితుల పట్ల తన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తపరచాడు. ఇంతలో ఆర్థిక శాఖామంత్రి లేచి రాజుగారి కోశాగారం నిండుకుందని, అందులో వున్న డబ్బు కేవలం కోటలో పని చేసే వారి జీతభత్యాలకు చాలదని నివేదించాడు. దాంతో చంద్రసేనుడు ఆగ్రహోదగ్రుడై అలా ఎలా జరిగింది! అని అడిగాడు. ఆర్థికశాఖామంత్రి అలా జరగటానికి కారణం రాజుగారేనని, వారు ప్రవేశపెట్టిన జన సంక్షేమ పథకాల వల్లనే ఈ ముప్పు వాటిల్లిందని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

" ఇప్పుడు ఏమిటి దారి? గోదారి అని మటుకు చెప్పొద్దు" రాజు గంభీరంగా ఆజ్ఞాపించాడు.

ఆర్థికమంత్రి నిల్చోని కాసేపు నీళ్ళు నమిలింతర్వాత దీనికి తరుణోపాయము ఉందని మనవి చేశాడు. అది ఏమిటని చంద్రసేనుడు అడుగకముందే మళ్ళీ ఇలా మనవి చేశాడు.

"మహారాజా! మన రాజ్యానికి పశ్చిమంగా నూరు యోజనాలు ప్రయాణిస్తే "రికా" అనే రాజ్యం వస్తుంది. దానిని ప్రస్తుతం ''శంతన్'' అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతని రాజ్యంలో చాలా డబ్బు మూలుగుతుందని విన్నాను. అతను ఉదారంగా రుణాలు కూడా ఇస్తాడని విన్నాను. మనం వెళ్ళి ఒక పది లక్షల బంగారు నాణాలు రుణం అడుగుదాం" అని ఆగాడు.

చంద్రసేనుడు భ్రుకుటి ముడివేసి ఈ విషయం అమాత్యులకు ఎలా తెలిసిందో చెప్పవలసిందిగా ఆదేశించాడు. అప్పుడు ఆర్థిక శాఖామంత్రి మళ్ళీ గొంతు సవరించుకొని "రాజా ! పదిహేను రోజుల క్రితం మన రాజధానిలో ఒక నీలి కళ్ళతో గోధుమ రంగు జుట్టుతో తెల్లగా మెరిసిపోయే దేహం కలిగిన విజాతీయుడిని మన వేగులవాళ్ళు పట్టుకొని నిర్బంధించారు. వాణ్ణి ఇనుప మేకుల పాదరక్షలతో మాడు మీద కొట్టగా అప్పుడు వాడు కేవలం మన రాజ్యం చూడటానికి వచ్చానని, తను ఫలానా "రికా" రాజ్యవాసినని వాళ్ళ ప్రభువు శంతన్ చాలా తెలివిగలవాడని తమలా దద్దమ్మ కాదని, కావాలంటే అప్పులు ఇస్తాడు" అని చెప్పగా మనవాళ్ళు వాడిని విడిచిపెట్టారట.

"అది సరే, ఆ నీలి కళ్ళ 'రికా' వాడికి మనరాజ్య భాష వచ్చునా?'' అనుమానంగా అడిగాడు చంద్రసేనుడు.

"రాదు గాక రాదు మా రాజా! వాడు మాట్లాడింది జాంగ్ల భాషట"

''మరి మనవాళ్ళకెలా బోధపడింది?'' చంద్రసేనుడు మరింత అనుమానంగా అడిగాడు. అతనికిదంతా ఏదో మాయగా, కుమ్మక్కు వ్యవహారంలా అగుపడుతోంది.

"మన వద్ద జాంగ్లభాష, పవిళభాష, ఇంకా ఏవేవో అయిదారు భాషలు క్షుణ్ణంగా వచ్చిన ద్వారపాలకుడు వున్నాడు మహాప్రభూ! అతనికి విద్యలో రెండు పట్టాలున్నాయి. ఎక్కడా ఉద్యోగం దొరకక మన వద్ద ద్వారపాలకుడిగా కుదురుకున్నాడు. అతని సహాయంతో నీలి కళ్ళవాడి భాషను అర్థం చేసుకున్నాం".

చంద్రసేనుడు కాస్త సంతృప్తిపడ్డాడు. రికా రాజ్యానికి చంద్రసేనుడు, ఆర్థికశాఖామంత్రి, దుబాసీగా ద్వారపాలకుడు వెళ్ళటానికి పండితోత్తములు ముహూర్తం నిర్ణయించారు.

సరిగ్గా వారం దినాల తర్వాత మొదలైన వారి ప్రయాణం ఆరు నెలల తర్వాత రికా రాజ్య రాజధాని చేరుకోవటంతో ముగిసింది. మర్నాడు చంద్రసేనుడు, ఆర్థికమంత్రి, దుబాసీ శంతన్ మహారాజును కలిశారు. సుహృద్భావ సంభాషణలు మొదలయ్యాయి. ద్వారపాలకుడు ఒక సుఖాసనంలో కూర్చోటంతో చంద్రసేనుడు అతని వంక గుర్రుగా చూశాడు. 'అలా చూస్తే దుబాసీతనానికి స్వస్తి చెబుతానంతే' బాహాటంగా బెదిరించాడు దుబాసీ. చంద్రసేనుడు నిస్సహాయుడై కూర్చుండిపోయాడు. జాంగ్ల భాషలో శంతన్ అడిగాడు.

## ప్రగతిబాట

నింగిని వీడిన
నీటి చుక్క
నేలను తాకి
నదిగా పారి
కడలిగ మారినట్లే -
పెదవిని దాటిన
మంచి మాట
మనసున నాటి
మనిషిని మార్చి
జగతి ప్రగతికి
బాట వేస్తుంది!

- వై.కె. మూర్తి

శంతన్ ప్రభువు, చంద్రసేనుడు దుబాసీని అడ్డుపెట్టుకుని గడగడా మాట్లాడుకున్నారు. శంతన్ మాట్లాడింది మొత్తం "షగుణింతం" అప్పగించినట్లుంది గాని ఒక్క ముక్క అర్థం కాలేదు. దుబాసీ కూడా శంతన్‌తో షగుణింతంలోనే మాట్లాడాడు. చంద్రసేనుడు " ఇష్టో" అనుకుని, ఇంతకీ అయనేమన్నాడో తెలుగులో అఘోరించమని దుబాసీని ఆజ్ఞాపించాడు.

శంతన్ అట్లాగే ఇస్తాననీ, చంద్రసేనుడి రాజ్య పరిస్థితులు తనకు తెలిశాయని, తనకు చాలా సానుభూతి వుందని తెలియచేస్తూ రుణానికి ఒక షరతు పెట్టాడు. తీసుకెళ్ళిన రుణం నుంచి ముందు రహదారులు వెడల్పు చేయించాలి. దుబాసీ ఆమాట చెప్పగానే చంద్రసేనుడు.

"చెప్పు తీసుకోని తంతా దుబాసీ వెధవా! నీళ్ళు లేక, పంటలు లేక జనం చస్తుంటే తటాకాలు తవ్వటానికి, నదులకు కాల్వలు తవ్వటానికి రుణం కావాలంటే రహదారులు వెడల్పు చేయించాలా? వాడి రుణం వాడి బొంద మీద కొట్టుకోమని జాంగ్ల భాషలో చెప్పు" అన్నాడు. దుబాసీ చంద్రసేనుడికి చాలా నచ్చ చెప్పాడు. కొన్ని రహదారులు వెడల్పు చేయించి మిగతా ధనం మన ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడదాం! మహారాజా అన్నాడు. సరేననక తప్పలేదు. శంతన్ హెచ్చరించాడు. తన రాజ్యంలో సాధించిన సాంకేతిక ప్రగతి, కనిపెట్టిన కొత్త ఆయుధాల గురించి వివరించి, చంద్రసేనుడి రాజ్యంలో ఏం జరిగినా తనకు ఒక యంత్రంలో కనిపిస్తుందని చెప్పాడు.

చంద్రసేనుడికి కోపం ఆగలేదు. నిస్సహాయత -కోపం కలగలిపి దుబాసీతో.

"చెప్పుతో మాడు మీద వెయ్యి ఈ వెధవనీ, రుణం మనం ఎలా వాడుకుంటే వీడికేం" ఉక్రోషంగా అన్నాడు. దుబాసీ హెచ్చరించాడు. మాటలు మీరవద్దు. శంతన్ దగ్గర కూడా మన భాష వచ్చినవాడు ఒకడున్నాడు. ఆ పక్కనే కూర్చుని వున్నాడు అని వేలితో చూపించాడు. చంద్రసేనుడి గుండె గుభేలంది.

"సరే రుణం ఇప్పించమను వీడు చెప్పినట్లే చేద్దాం" బాధని దిగమింగుకుంటూ అన్నాడు. తర్వాత కొన్ని సంచుల్లో బంగారు నాణాలతో సహా తన రాజ్యానికి వచ్చి రహదారుల కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాడు. దాంట్లో కొంత డబ్బు మిగుల్చుకుని కొంత ప్రజల మీద ఖర్చు పెట్టాడు.

కొంతకాలం జరిగింతర్వాత ధనం మళ్ళీ అవసరమైంది. మళ్ళీ బృందం రికా రాజ్యం చేరుకుంది. శంతన్ ఈసారి దుబాసీతో మాట్లాడుతూ రుణం ఇవ్వటానికి అభ్యంతరం లేదు కానీ ఒక షరతు మాత్రం వుందన్నాడు. చంద్రసేనుడు ఏడుపు నవ్వు కలిసిన ముఖంతో 'చిదం చిదం' అన్నాడు. ఆ షరతు ప్రకారం పంటలకు కావాల్సిన విత్తనాలన్నీ రికా రాజ్యంలోనే కొనాలి. పంటలన్నీ రికా రాజ్యానికి గానీ శంతన్ చెప్పిన రాజ్యానికి గానీ అమ్మాలి.

ఈ సారి ఈ షరతు ఒప్పుకోవద్దని దుబాసీ రాజుతో గోలపెట్టాడు. నెమ్మది నెమ్మదిగా శంతన్ తమ రాజ్యపు ప్రజల హక్కుల్ని హరించటానికి ప్రణాళికలు వేస్తున్నాడని నెత్తినోరు బాదుకున్నాడు. చంద్రసేనుడికి కోపం ఆగలేదు.

"నోర్ముయ్‌రా దుబాసీ వెధవా నీకు భాషలొచ్చు అని గర్వపడకు బుద్ధిలేని గాడిదా! నీకు పాండిత్యం వుందేమో గానీ రాజతంత్రం లేదు. మనకు పంటలే లేవు. శంతన్ వాడికే పంట నమ్మమన్నా ఇంకొకడి కమ్మమన్నా మనకొచ్చిన నష్టం ఏముంది. పంటలే లేనప్పుడు అమ్మటం ఏమిటోయ్ ఏబ్రాసి దుబాసీ" రాజుకు ఒక్క క్షణం ఆశ్చర్యమేసింది. ఇదేమిటి తనకూ ప్రాసలొస్తున్నాయి. తనకు తెలియకుండానే తనలో ఒక కవి దాక్కుని వున్నాడన్నమాట.

దుబాసీ మారు మాట్లాడలేదు. ధనం సంచులతో తిరిగి తమ రాజ్యం చేరుకున్నారు. కొంత డబ్బు జన సంక్షేమం మీద ఖర్చు పెట్టి మిగతాది ఒక నదికి కాల్వ తయారు చేయించటానికి వినియోగించాడు. విచిత్రం ఏమిటంటే ఆ ధనం ఆ కాల్వ ఒక మైలు దూరం తవ్వటానికి మాత్రమే పరిపోయింది. చంద్రసేనుడి పరిస్థితి కుడితిలో వడ్డ ఎలుకలాగయ్యింది. ప్రజల నుంచి గోల, తాళపత్రికల్లో లేఖలు, తెచ్చిన డబ్బంతా ఏమయ్యింది అని కొంత మంది జన ప్రతినిధుల గోల, చంద్రసేనుడికి ఏమీ పాలుపోవటం లేదు. హైరానా అంతా తనకేనా ఈ అమాత్యులు హాయిగా నిష్పూచిగా పెద్ద పెద్ద కొత్త రథాల్లో తిరుగుతున్నారు. వీళ్లని నమ్మటానికి వీలులేదు. వీళ్ళ కంటే ద్వారపాలక దుబాసీయే నయం అనిపిస్తున్నాడు. వాణ్ణి తన రహస్య మందిరానికి పిలుచుకున్నాడు.

"బాబ్బాబు ఇవి కాళ్ళు కావు చేతులనుకో!" అని వాడి చేతులు పట్టుకున్నాడు. రాజు గారికి ఏమన్నా పిచ్చి పట్టిందా? అని క్షణంలో సగం సేపు విస్తుపోయాడు దుబాసీ, తర్వాత

"రాజా ఇవి చేతులే కాళ్ళని ఎవరన్నారు? నాకు వచ్చిన ఆరు భాషల్లో ఏ ఒక్క దాంట్లో కూడా అలా అనలేదే" అని అడిగాడు.

"దుబాసీ నన్ను క్షమించు. నిన్ను అన్యాయంగా ఏబ్రాసి అని ఒకసారి తిట్టా. నిజమైన ఏబ్రాసిని నేను" క్షమాపూర్వకమైన గద్గద స్వరంతో చంద్రసేనుడు దుబాసీ చేతులు ఆప్యాయంగా పట్టుకొన్నాడు.

"నాకా సంగతి ఎప్పుడో తెలుసు మా రాజా" రాజు ఉలిక్కి పడ్డాడు. ఏం చేస్తాం కాలం కలిసిరానప్పుడు పై మీది బట్టే పామై కరుస్తుంది. నా ద్వారపాలకుడు నన్ను ఏబ్రాసి అన్నాడు. పోనీలే వాడి పాపాన వాడే పోతాడు. ఉచ్చం నీచం తెలియకుంటే వాడి కళ్ళే పోతాయి. అంతా కాలం నిర్ధారిస్తుంది.

" ఎలారా బాబూ? ధనం అయిపోయింది"

"రికా వెళ్దాం మహారాజా!"

"శంతన్ మళ్ళీ ఇస్తాడా!"

"తప్పకుండా ఇస్తాడు మహారాజా!"

ఈసారి మనిద్దరమే వెళదాము.

ఇద్దరూ రికా చేరుకుని శంతన్ దర్శనం చేసుకున్నారు. రుణం ఇవ్వటానికి శంతన్ ఒప్పుకుని మళ్ళీ ఒక షరతు పెట్టాడు. తన రాజ్యం నుంచి యాభై మంది వ్యాపారస్తులను తీసికెళ్ళి చంద్రసేనుడి రాజ్యంలో వాళ్ళని వ్యాపారం చేసుకోనివ్వాలనిట. శంతన్ చాలా చిద్విలాసంగా చెప్పాడు.

"వద్దు మహారాజా వద్దు ఇది కుట్ర" దుబాసీ రాజుగారి చెవిలో గుసగుసగా చెప్పాడు." మీ చంద్రసేనుడికి మళ్ళీ కోపం వచ్చింది.

" ఏంటోయి దుబాసీ, చనువిస్తే నెత్తికెక్కటం అంటే ఇదేనన్న మాట. మన రాజ్యంలో ప్రజలకు కొనుగోలు శక్తి లేనప్పుడు యాభై మంది వ్యాపారస్తులొస్తేం వంద మంది వస్తేం, దివాళా తీసి వాళ్ళే వాళ్ళ మాతృభూమికి పారిపోతారు" అని కిసుక్కుమన్నాడు చంద్రసేనుడు.

అలాగేనని చంద్రసేనుడు ధనం సంచులతో యాభై మంది వ్యాపారస్తులతో తన రాజ్యం చేరుకున్నాడు. కొంత కాలం రాజ్యం కళకళలాడింది. విచిత్రంగా యాభైమంది రికా వ్యాపారస్తులు పుంజుకున్నారు. చంద్రసేనుడి రాజ్యంలోని వ్యాపారస్తులు వాళ్ళ ధాటికి తట్టుకోలేక కొంచెం కొంచెంగా దివాళా తీయటం మొదలెట్టారు.

చంద్రసేనుడి పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. మళ్ళీ డబ్బు కావాలి. విచిత్రంగా పంటలు బాగా పండుతున్నాయి. కానీ అవి శంతన్ చెప్పిన ధరకు అతను చెప్పిన రాజ్యానికే అమ్మాలి. రైతులకు గిట్టుబాటు ధర లభించటం లేదు. వేప పుల్లతో పళ్ళుతోముకునే ప్రజలందరూ రికా నుంచి వ్యాపారస్తులు తెచ్చిన దంతశుభ్రలేహ్యాలకు అలవాటు పడ్డారు. దూరదృశ్య యంత్రాలు రికా నుంచి వచ్చి పడ్డాయి. వాటిల్లో ఎప్పుడూ అర్ధనగ్న దేహాలతో ఆటలాడే అందగత్తెలే దర్శనమిస్తారు. చంద్రసేనుడి ప్రజలు చాలా మంది పనీ పాట మర్చిపోయి ఆ యంత్రాలకు అతుక్కుపోయారు. మధ్య మధ్య వాటిల్లో కత్తి యుద్ధాలు, హత్యలు, దోపిడీలు పుష్కలంగా నిండిన నాటకాలు ప్రసారం చేస్తారు. అవి చూసి చూసి చంద్రసేనుడి రాజ్యంలోని చాలా మంది యువకులు హింసకు అలవాటు పడిపోయారు. రాజ్యం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిపోయింది.

ఆఖరిసారిగా రికా ప్రయాణం పెట్టుకున్నారు దుబాసీ, చంద్రసేనుడు. శంతన్ ఈసారి చాలా కటువుగా మాట్లాడాడు, ధనం రుణంగా ఇవ్వడానికి అంగీకరిస్తూ మళ్ళీ ఒక షరతు పెట్టాడు. ఆ షరతును దుబాసీ తన రాజుకు తర్జుమా చేసి ఇలా చెప్పాడు. "రాజా! రాజ్యం నీది రాజ్యాంగం నీది అంతవరకే. కానీ నీవు ఏం చేయాలో ఏం చేయకూడదో మేం చెపుతాము, నీవు అలా నడుచుకోవాలి. అంతే. నీ ప్రజల్ని ప్రత్యక్షంగా పాలించేది నీవు కానీ ప్రచ్ఛన్నంగా పరిపాలించేది మేము. అలా సమ్మతమయితే నీకు ఇంతకు ముందు ఇచ్చిన డబ్బు నాకు తిరిగి ఇవ్వక్కర్లేదు. కాదంటే ఆ డబ్బంతా ఇక్కడే నిలబడి కక్కు. నాకు ఆ మొహమాటాలు ఏమీ లేవు, నాకు కావలసింది ఈ భూమండలంలోని అన్ని రాజ్యాల మీద అధికారం".

చంద్రసేనుడికి కాదు అనటానికి గుండెలు చాలలేదు, కాసేపు ఆలోచించి సరేనన్నట్టు తల వూపాడు.

శంతన్ చెప్పాడు "చంద్రసేనా, వ్యాపారమిషతో రాజ్యాలు ఆక్రమించుకుని పరిపాలించే పద్ధతి కనీసం ఒక అయిదు వందల సంవత్సరాల క్రిందటిది. ఇప్పుడు అలా కాదు, మేమే రాజ్యము ప్రత్యక్షంగా ఆక్రమించుకోం కానీ మా పరిపాలన ఇష్టం వచ్చిన రీతిలో సాగాలి. ఇది ఈనాటి రాజనీతి అన్నాడు. చంద్రసేనుడు డబ్బు మూటలతో దుబాసీతో తన రాజ్యం చేరుకున్నాడు. రాజనీతిలో ఒక కొత్త విషయం తెలుసుకున్నందుకు చాలా సంతోషపడ్డాడు. ○